మద్యం దుకాణాలు ఎవరికో?

- నేడు టెండర్ల లాటరీ
- ఉదయం 7 గంటల నుంచే ప్రక్రియ

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ప్రయివేటు మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియలో ఇప్పటికే దరఖాస్తుల అంకం ముగిసింది. సోమవారం టెండర్ల లాటరీ నిర్వహించనున్నారు. ఉదయం 7 గంటల నుంచే లాటరీ ప్రక్రియ ప్రారంభించి ప్రయివేటు మద్యం దుకాణాలను కేటాయించనున్నారు. లాటరీ ద్వారా దుకాణాలు కేటాయించేందుకు ఎక్సైజ్ శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కర్నూలు జిల్లాకు సంబంధించిన లాటరీ కర్నూలు జిల్లా పరిషత్ హాల్‌లో, నంద్యాల జిల్లాకు సంబంధించిన లాటరీ నంద్యాల కలెక్టరేట్ సెంటినరీ హాల్‌లో నిర్వహించనున్నారు...

ప్రయివేటు మద్యం దుకాణాలకు ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసింది. కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీని కోసం గత నెల చివరి నుండి ఈ నెల 9 వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. అయితే స్థానికంగా అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు మద్యం దుకాణాల కోసం దరఖాస్తూ చేసుకోవద్దని, ఒక్కో షాప్‌కు తమ అనుచరులే చేసుకుంటారని పోటీ ఎవ్వరు రావద్దని చెప్పడంతో పాటు బెదిరింపులకు దిగడంతో అక్కడక్కడా దరఖాస్తులు తక్కువ వచ్చాయి. కొన్ని మండలాల్లో కేవలం షాప్‌కు ఒక్కటి లేక రెండు దరఖాస్తులు రావడం దీనిపైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జోక్యం చేసుకోని ఎక్కడా పోటీని అడ్డుకోవద్దని, ప్రభుత్వానికి ఆదాయం రావాలని చెప్పడంతో 9తో ముగిసిన గడువును 11న రాత్రి 7గంటల వరకు పొడగించారు. దీంతో కర్నూలు, నంద్యాల జిల్లాలో భారీ ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. కర్నూలు జిల్లాలోని 7 అబ్కారీ పోలీస్ స్టేషన్లో పరిధిలో 99 ప్రయివేటు మద్యం దుకాణాలను టెండర్లు పిలవగా మొత్తం 3013 దరఖాస్తులు అందాయి. ఇందులో కర్నూలు స్టేషన్ పరిధిలో 1427 అత్యధికంగా దరఖాస్తులు అందాయి. అత్యల్పంగా కోసిగి స్టేషన్ పరిధిలో 53 దరఖాస్తులు వచ్చాయి. కోడుమూరు 508, ఆదోని 247, ఆలూరు 186, ఎమ్మిగనూరు 296, పత్తికొండ 296 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తుల ద్వారా ఎక్సైజ్ శాఖకు రూ.60.26 కోట్లు ఆదాయం లభించింది. నంద్యాల జిల్లాలోని 105 ప్రయివేటు మద్యం దుకాణాలకు 2,155 దరఖాస్తులు వచ్చాయి. దీంతో రూ.43.10 కోట్ల ఆదాయం సమకూరింది. స్టేషన్ల వారీగా ఆళ్లగడ్డ 19 షాప్‌లకు 325 దరఖాస్తులు, ఆత్మకూర్ 13 షాప్‌లకు 248 దరఖాస్తులు, బనగానపల్లె 12 షాప్‌లకు 168, డోన్ 16 షాప్ లకు 370 దరఖాస్తులు, కోవెలకుంట్ల 11 షాప్‌లకు 150 దరఖాస్తులు, నందికొట్కూరు 10 షాప్‌లకు 181 దరఖాస్తులు, నంద్యాల 24 షాప్‌లకు 713 దరఖాస్తులు వచ్చాయి. ఇతర రాష్ట్రాలు తెలంగాణ నుండి 26 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు ప్రకటించారు. సోమవారం ఉదయం ప్రయివేటు మద్యం దుకాణాల కేటాయింపు కోసం లాటరీ ప్రక్రియ నిర్వహించనున్నారు. కర్నూలు జిల్లాకు సంబంధించిన లాటరీ కర్నూలు జిల్లా పరిషత్ హాల్‌లో, నంద్యాల జిల్లాకు సంబంధించిన లాటరీ నంద్యాల కలెక్టరేట్ సెంటినరీ హాల్‌లో నిర్వహించనున్నారు. ఇందు కోసం ఎక్సైజ్ శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా కలెక్టర్ల సమక్షంలో ఈ లాటరీ ప్రక్రియ నిర్వహించనున్నారు. దరఖాస్తుదారునితో పాటు ఒకరిని మాత్రమే లాటరీ హాల్‌లోకి అనుమతించనున్నారు. అందు కోసం ఎక్సైజ్ శాఖ అధికారులు ఎంట్రీ పాస్‌లను జారీ చేశారు.

ప్రజాప్రతినిధుల పావులు

మద్యం దుకాణాలకు కేటాయింపులో కొంతమంది ప్రజా ప్రతినిధులు వాటాల కోసం పావులు కదుపుతున్నారు. ఇతరులు దక్కించుకున్న మద్యం దుకాణాల్లోనూ వాటాల కోసం కొంతమంది ప్రజాప్రతినిధులు తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్లు చెబుతున్నారు. మద్యం దుకాణాలకు వేసే దరఖాస్తుల్లో సిండికేట్ విధానానికి తెరలేపేందుకు నాయకులు వ్యూహాలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. దుకాణం దక్కించుకున్న వ్యక్తి దక్కని వ్యక్తులకు వాటా ఇవ్వాలా.. కొంతమొత్తంలో సొమ్ము చెల్లించాలా అనే దానిపై తీవ్ర తర్జనభర్జనలు పడుతున్నట్లు చెబుతున్నారు.

ప్రయాణికుల భద్రతే ధ్యేయం

- సురక్షితంగా గమ్యస్థానాలకు చేరేలా బస్సులు
- అందుబాటులోకి కొత్తగా 35 సర్వీసులు
- కార్గో ద్వారా నెలకు రూ.50 లక్షల ఆదాయం
- ప్రజాశక్తితో జిల్లా ప్రజారవాణాధికారి(డిపిటిఒ) టి.శ్రీనివాసులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

'ఎపిఎస్‌ఆర్‌టిసిలో ప్రయాణికులకు సౌకర్య వంతమైన, సురక్షితమైన ప్రయాణాన్ని అందించడమే ప్రధాన ధ్యేయం. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించి వారి ప్రయాణానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే విధంగా బస్సులను ఏర్పాటు చేసి ప్రయాణికుల మెప్పుపొందే విధంగా కృషి చేస్తున్నాం. కార్గో ద్వారా నెలకు రూ.50 లక్షల ఆదాయం సమకూరుతోంది. ' అని కర్నూలు జిల్లా ప్రజా రవాణాధికారి టి. శ్రీనివాసులు అన్నారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు...

కర్నూలు జిల్లాలో ఎన్ని డిపోలు ఉన్నాయి..? ఎన్ని బస్సులు ఉన్నాయి..?

డిపిటిఒ : కర్నూలు జిల్లాలో ఐదు బస్సు డిపోలు ఉన్నాయి. కర్నూలులో 2 డిపోలు, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆదోని డిపోలు ఉన్నాయి. కర్నూలు రీజియన్‌లో మొత్తం 424 బస్సులు ఉన్నాయి. అందులో 383 బస్సులు ప్రతిరోజు తిరుగుతున్నాయి. వాటికి తోడుగా 29 విద్యార్థి బస్సులు కూడా తిరుగుతున్నాయి. ప్రతిరోజు 92,000 మంది ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు చేరుస్తున్నాం.

కొత్తగా ఎన్ని బస్సులు వచ్చాయి?

డిపిటిఒ : కొత్తగా 35 బస్సులు వచ్చాయి. అందులో సూపర్ లగ్జరీ 14, ఎక్స్‌ప్రెస్ 17, అల్ట్రా డీలక్స్ రెండు, స్టార్ లైనర్ రెండు బస్సులు వచ్చాయి.

కర్నూల్ రీజియన్‌లో ఎంతమంది ఉద్యోగులు పనిచేస్తున్నారు?

డిపిటిఒ : కర్నూల్ రీజియన్‌లో మొత్తం 1,649 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. కండక్టర్లు 462 మంది, డ్రైవర్లు 746 మంది, మెకానిక్‌లు, అసిస్టెంట్ మెకానిక్‌లు 150 మంది, సెక్యూరిటీ గార్డులు 38 మంది, ఇతరులు 253 మంది పనిచేస్తున్నారు.

జిల్లాలో బస్టాండ్లలో ఎన్ని స్టాల్స్ ఉన్నాయి? ఎన్ని ఖాళీగా ఉన్నాయి? ఎంత ఆదాయం వస్తుంది?

డిపిటిఒ : జిల్లాలోని 5 బస్ డిపోలలో 466 స్టాల్స్ ఉన్నాయి. అందులో 31 స్టాల్స్ ఖాళీగా ఉన్నాయి. స్టాల్స్ ద్వారా నెలకు 69 లక్షల రూపాయలు ఆదాయం వస్తుంది.

పాత బస్సులు ఏమైనా ఉన్నాయా?

డిపిటిఓ : పాత బస్సులను స్క్రాప్‌కు పంపడం జరుగుతుంది. బస్సులు 15 సంవత్సరరాలు తిరిగిన తర్వాత వాటిని స్క్రాప్ కిందకి పంపడం జరుగుతుంది.

దసరా పండగ సందర్భంగా ప్రయాణికుల ఏమైనా రాయితీ ఇస్తున్నారా?

డిపిటిఒ : దసరా పండగ సందర్భంగా ప్రయాణికులు ముందస్తు రాను పోను రిజర్వేషన్ చేసుకున్న వారికి చార్జీలో 10 శాతం రాయితీ ఇస్తున్నాం. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనంగా బస్సులు తిప్పుతూ ఎలాంటి అదనపు చార్జీలు లేకుండా మామూలు చార్జీలతోనే ప్రయాణికులకు వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం.

కార్గో ద్వారా నెలకు ఎంత ఆదాయం వస్తుంది?

డిపిటిఒ : ఏపీఎస్‌ఆర్టీసీ కార్గో ద్వారా ప్రజల యొక్క వస్తువులు, సరుకులు, పార్సిల్లు సురక్షితంగా 24 గంటల్లోపే వారు కోరుకున్న స్థానానికి చేర్చడం ద్వారా ప్రజల్లో నమ్మకం ఏర్పడి కార్గో ద్వారా ప్రజలు పార్సిల్ పంపుకోవడానికి మక్కువ చూపుతున్నారు. దీంతో నెలకు ఏపీఎస్‌ఆర్టీసీకి కార్గో ద్వారా రూ.50 లక్షల ఆదాయం వస్తోంది.

పరిశుభ్రత విషయమై ఏమైనా కార్యక్రమాలు చేశారా?

డిపిటిఒ : కర్నూలు బస్టాండు రెండు డిపోలతో పాటు మిగతా మూడు డిపోల్లో కూడా స్వచ్ఛతాహి సేవ 2024లో భాగంగా సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 1వ తేదీ వరకు కార్యాలయాల పరిసరాలు శుభ్రం చేయించాం. అలాగే కార్యాలయంలో కుర్చీలు, బల్లలకు రంగులు వేయించడం జరిగింది. గ్యారేజీలో కూడా పరికరాలు శుభ్రం చేయించాం. అమ్మ పేరుతో ఒక మొక్క అనే పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేసాం. బాత్రూంలు, లెట్రిన్లకు కూడా వెల్ల వేయించి శుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకున్నాం. బస్సులు, డ్రైవర్ క్యాబిన్లను శుభ్రంగా చేయించడం జరిగింది. అన్ని బస్ స్టేషన్లు, కార్యాలయం లోపల డస్ట్ బిన్లు ఏర్పాటు చేసే విధంగా అవగాహన కల్పించాం. బస్ స్టేషన్ల పరిధిలోని హోటల్లో కూడా శుభ్రంగా ఉంచుకునే విధంగా సిబ్బంది వారికి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అన్ని డిపోల్లోని సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మీరు అందించే సలహా ?

డిపిటిఒ : వేగంగా ప్రయాణం చేయాలనే తపనతో ప్రైవేట్ వాహనాలలో వెళ్లి ప్రాణాలు కోల్పోవద్దు. ప్రజల రక్షణే ధ్యేయంగా నడుపుతున్న ఏపీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో సౌకర్యవంతమైన, సుఖవంతమైన, సురక్షితంగా ప్రయాణం సాగించి గమ్యస్థానాలకు చేరాలి.

దేవరగట్టులో రక్తపాతం

- 95 మందికి గాయాలు - బన్ని ఉత్సవంలో నాట్యమాడిన కర్రలు
- గట్టుపై భక్తులదే పట్టు - ఫలించని పోలీసుల వ్యూహం

ప్రజాశక్తి -హోళగుంద

కర్నూలు జిల్లా హొళగుంద మండల పరిధిలోని నెరణికి, నెరణికి తండా, కొత్తపేట కొండ గుహలో వెలసిన దేవరగట్టు శ్రీ మాల మల్లేశ్వరల జైత్రయాత్ర (కర్రల సమరం) శనివారం అర్ధరాత్రి జరిగింది. నిఘనేత్రాలు ఉన్నప్పటికీ కర్రలు నాట్యం ఆడాయి. పోలీసుల వ్యూహాలు ఫలించలేదు. జైత్ర యాత్రలో రింగ్ కర్రలు, అగ్ని దివిటీల ఆవిరి తగిలి 95 మందికి గాయాలయ్యాయి అందులో 25 మందికి బలమైన గాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం ఆలూరు, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. బన్నీ ఉత్సవం తొక్కిసలాటలో లింగంపల్లి గ్రామానికి చెందిన మల్లికార్జున అనే భక్తుడికి కాలు విరిగింది. హొళగుందకు చెందిన పూతప్ప తలకు బలమైన గాయాలు కావడంతో పరిస్థితి విషమంగా ఉండటంతో ఆదోని ఆసుపత్రికి తరలించారు. 800 మంది పోలీసులు ఉన్నప్పటికీ రింగ్ కర్రలను దేవరగట్టుకు రాకుండా ఆపలేకపోయారు. అవగాహన సదస్సులు, రింగ్ కర్రలు స్వాధీనం చేసుకున్నప్పటికీ రక్తపాతం ఆగలేదు. పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారు తప్ప నివారించడంలో విఫలమయ్యారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

జైత్రయాత్ర సాగిందిలా..

శ్రీ మాల మల్లేశ్వర జైత్రయాత్రను కొనసాగించుటకు నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తులు శనివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో పాలబండకు చేరుకొని ఉత్సవాలను ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో కలిసికట్టుగా అన్నదమ్ములవలె ఉండాలని పాత కక్షలు పెట్టుకోకూడదని పాల బాస (తీర్మానం) తీసుకున్నారు. అనంతరం మూడు అవుట్లు వదిలి డుర్ర గో పరాక్ మాల మల్లేశ్వర బహుపరాక్ అంటూ నినాదాలు చేసి ఏకతాటిపై అందరూ ఒక్కసారిగా మాల మల్లేశ్వర సన్నిధికి చేరుకున్నారు. కొండపైకి వెళ్లి, ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీ మాల మల్లేశ్వరలకు వివాహం జరిపించారు. అనంతరం జైత్ర యాత్రలో భాగంగా శ్రీ మాల మల్లేశ్వరల విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న సమయంలో విగ్రహ మూర్తులను దక్కించుకోవాలని ఒకరిని ఒకరు కొట్టుకున్నారు. కర్రలు నాట్యమాడాయి. దీంతో రక్తపాతం చెలరేగింది. గురవయ్య తన తొడ పిక్కల నుండి రక్తాన్ని చిందించి అక్కడ నుండి జైత్రయాత్ర యాత్ర బసవన్న గుడి దగ్గరకు చేరుకొని భవిష్యవాణి వినించారు. మాల మల్లేశ్వర విగ్రహ మూర్తులు సింహాసన కట్టకు చేరడంతో ఉత్సవం ముగిసింది. దీంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ఎస్పీ బిందు మాధవ్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, పత్తికొండ డిఎస్పి వెంకటరామయ్య, ట్రెయినీ డీఎస్పీ ఉషశ్రీ, హొళగుంద తాసిల్దార్ హుస్సేన్ సాబ్ ఏర్పాట్లను పరిశీలించి బందోబస్తు నిర్వహించారు.

ఏరులై పారిన కర్ణాటక మద్యం, నాటుసారా

దేవరగట్టులో శనివారం జరిగిన కర్రల సమరంలో కర్ణాటక మద్యం ప్యాకెట్లు, నాటుసారా ఏరులై పారాయి. అంత మంది పోలీసులు ఉన్నా కర్ణాటక మద్యం దేవరగట్టులో ప్రత్యక్షమవడం ఆశ్చర్యానికి గురి చేసింది. గత రెండు నెలలుగా ఎక్సైజ్ పోలీస్ అధికారులు దేవరగట్టు పరిసర ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా కాస్తున్న నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించి వందల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినా దేవరగట్టులో నాటుసారా ఏ రహదారుల చూసిన కనపడటం వెనక పోలీసుల పాత్ర ఉండే ఉంటుందని చర్చించుకున్నారు. శ్రీ మాల మల్లేశ్వర జైత్రయాత్రలో భక్తులు మద్యం సేవించి మైకంలో పాల్గొనడం ఇష్టానుసారంగా ఒకరినొకరు కొట్టుకోవడం వల్ల అధిక సంఖ్యలో గాయాలు అయ్యాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

బన్ని ఉత్సవాన్ని పర్యవేక్షిస్తున్న జిల్లా ఎస్‌పి బిందు మాధవ్

బన్ని ఉత్సవాన్ని తిలకిస్తున్న ప్రజలు

గాయపడిన భక్తులు

నేటి నుండి 'పల్లె పండగ'

- ఉపాధి ద్వారా రూ.83 కోట్లతో పనులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పల్లె పండుగ వారోత్సవాలను సోమవారం నుండి జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రారంభమవుతున్నాయని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వారం రోజులపాటు ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. పల్లె పండుగ వారోత్సవాలలో భాగంగా గ్రామాల్లో సిసి రోడ్లు, గోకులం, పౌల్ట్రీ షెడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా 1533 పనులకు రూ.83 కోట్లతో పనులు చేపడుతున్నామన్నారు. ఎంపి, ఎమ్మెల్యేలు, జడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, సర్పంచులు తోపాటు అధికారులు కూడా భాగస్వామ్యం కావాలని కోరారు.

నేడు కలెక్టరేట్ , డిఎంహెచ్ఒ కార్యాలయాల ముందు ధర్నా

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

కలెక్టరేట్, డిఎం అండ్‌హెచ్ఒ కార్యాలయాల రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 14న సోమవారం హెల్త్ సెక్రటరీల ధర్నా ఉంటుందని సచివాలయ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షులు మహేశ్వరమ్మ, రాష్ట్ర ప్రధాన ఆర్గనైజింగ్ కార్యదర్శి సంధ్యారాణి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి పల్లె పండుగ వారోత్సవాలు

ప్రజాశక్తి-మద్దికెర

నేటి నుంచి పల్లె పండగ వార్షికోత్సవాలు ప్రారంభమవుతున్నట్లు ఎంపిడిఒ కొండయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 14 నుంచి 19 వరకు పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు, నిర్వహిస్తామని వారన్నారు. 14న బసినేపల్లి , 15న బొమ్మనపల్లి, 16న యడవలి, 17 బురుజుల, 18 హంప, 19న పెరవలి, అగ్రహారం, మద్దికేర, కేంద్రంలో ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కెఇ. శ్యాంబాబు హాజరవుతారని తెలిపారు.

రాజవర్ధన్‌రెడ్డి జ్ఞాపకార్థం దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-కోడుమూరు రూరల్

దసరా పండగ సందర్భంగా కీర్తిశేషులు డి.రాజవర్ధన్ రెడ్డి జ్ఞాపకార్థం తో అనుగొండ గ్రామ టిడిపి నాయకులు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శనివారం దుస్తుల పంపిణీ చేశారు. రాజవర్ధన్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా 300 మహిళలు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చిన 300 మంది మహిళలకు రామకృష్ణారెడ్డి చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి వచ్చిన 100 మంది పురుషులకు కూడా కొత్తవి ఇచ్చారు. ఈ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ మా నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి కుమారుడు రాజవర్ధన్‌రెడ్డి లేనిలోటు చాలా బాధాకరమన్నారు. రాజవర్ధన్‌రెడ్డి ఆశయాలను కోడుమూరు మండలంలో ముందుకు తీసుకెళ్లేందుకు నా వంతు ప్రయత్నం చేస్తానని, మా పెద్దాయన విష్ణు వర్ధన్‌రెడ్డి అడుగుజాడలలో అనుగొండ గ్రామాన్ని నడిపిస్తానన్నారు. విష్ణువర్ధన్‌రెడ్డి , ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సహకారంతో కోడుమూరు మండలంలో అభివృద్ధి పనులు చేస్తామన్నారు.300 మహిళలకు, 100 మంది పురుషలకు కొత్త దుస్తులు పంపిణీ చేస్తూ, ప్రతి ఒక్కరికీ స్వీట్స్ పంచారు.

వైభవంగా దుర్గామాత విగ్రహాల నిమజ్జనం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టిజి.భరత్

రాష్ట్రంలోని ప్రజలంతా సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండేలా చూడాలని ఆ దుర్గామాతను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి. భరత్ కోరారు. ఆదివారం సంకల్ బాగ్ వద్ద గంగామాత విగ్రహానికి, దుర్గమాత విగ్రహాలకు పూజలు నిర్వహించి రావణ దహనం చేశారు. అనంతరం నిమజ్జనాన్ని మంత్రి టిజి. భరత్, రాజ్యసభ మాజీ సభ్యులు టిజి వెంకటేష్ ప్రారంభించారు. మంత్రి టిజి భరత్ మాట్లాడుతూ దసరా పండుగ సందర్భంగా ఆ దుర్గామాతకు తొమ్మిది రోజుల పాటు భక్తి, శ్రద్ధలతో పూజలు చేశారన్నారు. శరన్నవరాత్రుల్లో భాగంగా కర్నూలు నగరంలో అంగరంగ వైభవంగా పూజలందుకొని ఆదివారం 11వ రోజు నగరంలో దుర్గామాతల నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించు కుంటున్నామని అన్నారు. రాష్ట్ర ప్రజలు అందరూ సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండేలా చూడాలని ఆ దుర్గామాతను కోరానని మంత్రి అన్నారు. గణేష్ నిమజ్జనం లాగానే దుర్గామాతల నిమజ్జనాలు కూడా జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. టీజీవి గ్రూపు ద్వారా దాదాపు రూ.5 లక్షలతో 47 మట్టి దుర్గామాత విగ్రహాలను ఏర్పాటు చేశామన్నారు. గణేష్ ఉత్సవాలను కూడా వచ్చే సంవత్సరం మట్టి విగ్రహాలతోని నిర్వహించు కోవాలని మంత్రి కోరారు. 22 సంవత్సరాల నుంచి దుర్గామాతల నిమజ్జనాలు నిర్వహించడం రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా మన కర్నూలులో చేస్తున్నా మన్నారు. కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్,నగర మేయర్ బివై.రామయ్య మాట్లాడారు. రామాయణంలో శ్రీరామ చంద్రుడు రావణ సంహారం చేశారని వివరించారు. మహాభారతంలో పాండవులు తమ ఆయుధాలను జమ్మి చెట్టుపై పెట్టారని, ఆయుధాలు తుప్పు పట్టకుండా ఉండేందుకే వారు జమ్మి చెట్టుపై పెట్టారనే ప్రచారం ముందన్నారు. ప్రజలు కులాలు మతాలకతీతంగా మంచి చేసే వారిని గుర్తించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మన సంస్కృతి, ధర్మాలను కాపాడుకోవాలని కోరారు. టిజివి కళాక్షేత్రం వారు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జ్ఞాపికలు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, డిఎస్‌పి బాబు ప్రసాద్, విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర నంది రెడ్డి సాయి రెడ్డి పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా ఆశయాల కొనసాగింపే నిజమైన నివాళి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రొఫెసర్‌సాయిబాబకు నివాళి అర్పిస్తున్న వివిధ సంఘాల నేతలు

హైదరాబాద్‌లో మరణించిన మానవ హక్కుల నేత ప్రొఫెసర్ సాయిబాబా సంతాప సభ నేడు కర్నూలులోని ప్రగతిశీల మహిళా సంఘం కార్యాలయంలో విరసం బాధ్యులు పాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సంతాప సభలో వివిధ సంఘాల బాధ్యులు పాల్గొని, ప్రొఫెసర్ సాయిబాబా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. పాణి మాట్లాడుతూ ప్రొఫెసర్ సాయిబాబా అరుదైన వ్యక్తిత్వం గల ప్రజామేధావి అని అన్నారు. రాజ్యం క్రూరత్వానికి బలై గత పదేళ్ళు జైలు లో మగ్గిపోయారని, అయినా విడుదల అనంతరం ఏ మాత్రం భయపడకుండా ప్రజల పక్షం నిలబడి ప్రభుత్వ ఫాసిస్టు విధానాలను మరణించే వరకు ప్రశ్నించారని, ఆయన ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని అన్నారు. పోస్టల్ యూనియన్ నాయకులు మల్లేశ్వర రెడ్డి మాట్లాడుతూ ప్రొఫెసర్ సాయిబాబా మరణం రాజ్యం చేసిన హత్య అన్నారు. పదేళ్ల జైలు నిర్బంధంలో కనీస వైద్య సహాయం అందించకుండా ఆయన మృతికి కారణమయ్యిందన్నారు. బుద్ధి జీవులు, ప్రజలు ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను ప్రశ్నించాలన్నారు. రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ భాస్కర రెడ్డి మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం తన విధానాలను ప్రశ్నించే వారిని మావోయిస్టులుగా ముద్రవేస్తూ, వేధింపులకు గురి చేస్తూవుందన్నారు. ప్రజల పక్షం వహించిన మేధావుల గొంతుకలు నొక్కివేస్తుందని, 90శాతం అంగవైకల్యం కలిగిన ప్రొఫెసర్ సాయిబాబా మొక్కవోని ధైర్యంతో ప్రజల హక్కుల కొరకు పనిచేశారని తెలిపారు. కుల నిర్మూలనా పోరాట సమితి బాధ్యులు సుబ్బారాయుడు మాట్లాడుతూ, ప్రొఫెసర్ సాయిబాబా, దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలను సంఘటితం చేయడానికి కృషి చేశారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించారని, ఫలితంగా ప్రభుత్వాలు, వ్యవస్థలు ఆయనపై కక్ష గట్టాయని, ఆయనది రాజ్యం చేసిన హత్య అన్నారు. బుడగ జంగాల సంక్షేమ సంఘం నాయకులు తుర్పాటి మనోహర్ మాట్లాడుతూ నేడు ప్రభుత్వాలు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయని, ఖైదీలకు రాజ్యాంగపరంగా ఇవ్వవలసిన సౌకర్యాలను కల్పించడం లేదన్నారు. ప్రొఫెసర్ సాయిబాబా వికలాంగుడు అయినప్పటికీ జైలులో కనీస సౌకర్యాలను కల్పించలేక పోయారని, ఫలితంగా ప్రొఫెసర్ ఆరోగ్యం క్షీణించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంతాప సభలో రైతు కూలీ సంఘం నాయకులు సుంకన్న, పౌర హక్కుల సంఘం మాజీ అధ్యక్షుడు రాజాసాగర్, డిటిఎఫ్ బాధ్యులు రత్నం ఏసేపు, లక్ష్మీకాంత్, ఈశ్వరయ్య, గోపాలరెడ్డి, నాగన్న నివాళులు అర్పించారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని, వాతావరణ శాఖ హెచ్చరికలతో కలెక్టరేట్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కలెక్టర్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండాజాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఏ సమస్య ఉన్నా కమాండ్ కంట్రోల్ రూమ్ 08518-277305 నెంబర్ కు ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు. మండల, డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైతే ప్రజలకు అందచేయడానికి నిత్యావసర వస్తువులను కూడా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

గ్రావెల్ రోడ్డును వెంటనే వేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కేతవరం నుండి గార్గేయపురం వరకు గ్రావెల్ రోడ్డును వెంటనే వేయాలని ఓర్వకల్ సిపిఎం మండల కార్యదర్శి బి.నాగన్న డిమాండ్ చేశారు. ఆదివారం కేతవరం గ్రామంలో వేస్తున్న రోడ్డు నిర్మాణ పనులను సిపిఎం ప్రతినిధి బృందం పరిశీలించింది. మండల కార్యదర్శి బి.నాగన్న తో పాటు కేతవరం శాఖ కార్యదర్శి జి శ్రీధర్ సిపిఎం నాయకులు వెంకటేశ్వర్లు, రంగస్వామి, బుగ్గ రాముడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల క్రితం అనేక పోరాటాల ఫలితంగా కేతవరం నుండి గార్గేయపురం ప్రధాన రహదారి వేశారన్నారు. ఐదు సంవత్సరాలు పూర్తి కాకముందే పూర్తిగా రోడ్డు దెబ్బతినిందన్నారు. నాలుగు కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాలంటే స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాణ్యమైన గ్రావెల్,మట్టి కాకుండా సుద్దమట్టితో రోడ్డు వేయడం దుర్మార్గమన్నారు. ఈ రోడ్డు ఎక్కువకాలం కూడా ప్రజలకు ఉపయోగకరంగా ఉండదన్నారు. వెంటనే సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని గ్రావెల్ రోడ్డు వేసేలా కాంట్రాక్టరుకు ఆదేశాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, మధుసూదన్, బాబు, శేషాద్రి నాయుడు, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విజయదశమి ఉత్సవాలు



ప్రజాశక్తి - సి బెళగల్ : మండలంలో విజయదశమి సందర్భంగా ఉత్సవాలు శని, ఆది వారాలలో ఘనంగా జరిగాయి. ప్రతి గ్రామంలో జమ్మి చెట్టువద్దకు ఊరేగింపుగా భక్తులు, పెద్దలు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. అక్కడే ఉత్సవ మూర్తులకు, కురు వృద్ధులకు, కుటుంబ పెద్దలకు మొకరిల్లి పెద్దరికాన్ని గౌరవ వందనం చేశారు. అమ్మవార్ల పల్లకి ఉత్సవాలు నిర్వహించారు. సి బెళగల్‌లో జనసైందోహం మధ్య దసరా ఉత్సవాలు అంబరన్నాంటాయి.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ముగ్గురు మృతి

ప్రజాశక్తి - ఆలూరు

ద్విచక్రవాహనం అదుపుతప్పి ముగ్గురు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కరిడిగుడ్డం సమీపంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. విజయ దశమి పండుగ పర్వదినాన బళ్ళారి జిల్లా హగిరి మండలం తగ్గినబూదహాల్ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు కలసి ద్విచక్ర వాహనంపై దేవరగట్టు మాలమల్లేశ్వరస్వామి బన్ని ఉత్సవానికి వెళ తుండగా కరిడిగుడ్డం సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి హరీష్(22), మల్లికార్జున(26) అక్కడికక్కడే మృతి చెందారు. విషమంగా ఉన్న రవి కుమార్(27)ను స్థానికులు అంబులెన్స్‌లో ఆలూరు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కొరకు వైద్యులు బళ్ళారి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఒకే గ్రామస్తులు, స్నేహితులు, చేతికొచ్చిన కొడుకులు మృతి చెందడంతో ఆసుపత్రి ప్రాంగణంలో తల్లిదండ్రులు, బంధువుల అర్ధనాథలతో అందరినీ కంటతడి పెట్టించాయి. పోలీసుల నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణమని ప్రజా సంఘాలు పేర్కొంటున్నాయి. వందల మంది పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసినా ప్రమాదాలు జరగడం గమనార్హం అని తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

భౌతిక కాయం వద్ద రోదిస్తున్న బంధువులు

మిత్రుడి కుటుంబానికి అండగా

- మృతి చెందిన మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గోనెగండ్ల

పెద్దమరివీడు చెందిన కటికే నబిరసూల్ బుక్ కీపర్‌గా పనిచేస్తూ ఇటీవలే అకస్మాత్తుగా మృతి చెందాడు. అతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. పెద్ద కుమార్తెకు వివాహం కూడా నిశ్చయమైంది. ఇలాంటి సందర్భంలో నబి రసూల్ మృతితో కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఇబ్బందులకు గురైంది. ఈ విషయం మండల కేంద్రమైన గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అతనితో పాటు కలిసి చదువుకున్న 2000 సంవత్సరం ఎస్ఎస్‌సి బ్యాచ్ పూర్వ విద్యార్థులకు తెలిసింది. స్పందించిన మిత్ర బృందం పెద్దమరివీడులోని మిత్రుని ఇంటికి ఆదివారం వెళ్లి మృతుని భార్య, పిల్లలకు రూ.50 వేల ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబానికి అండగా మేమున్నామంటూ భరోసా కల్పించారు. భవిష్యత్తులో మిగతా ఇద్దరు పిల్లల చదువులకు సహకరిస్తామని కూడా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మిత్రులు ఎస్ షేక్షావలి, గానిగ బాషా, రామకృష్ణ, ఖాసిం సాహెబ్, రంగస్వామి, జిక్రియ, వీరేష్, రంగన్న, జనార్ధన్, రసూల్ పాల్గొన్నారు.

- మృతి చెందిన మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

క్రైస్తవ సమాజానికి అండగా ఉంటా

- ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి

ప్రజాశక్తి - ఆదోని

కుల మతాలకు అతీతంగా సోదర భావంతో కలిసిమెలిసి జీవించాలని, అప్పుడే ప్రశాంతంగా ఉంటామని ఎమ్మెల్యే పార్థసారథి వాల్మీకి తెలిపారు. ఆదివారం ఆదోని పట్టణంలోని ఎస్‌కెడి కాలనీలోని సిఎస్ఐ హోలీ ట్రినిటీ చర్చిలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ప్రార్ధనల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రైస్తవ సమాజానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. వికలాంగులైన ప్రతి ఒక్కరికి ప్రత్యేక సదుపాయాలు, ప్రత్యేక అవకాశాలు, ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆదోనిలో ఉన్న 150 చర్చిల్లో ఉన్న పాస్టర్లు, క్రైస్తవ సమాజం ఏ సమస్యలు ఉన్నా నేరుగా వచ్చి కలవచ్చని, ఆ సమస్యను పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. పాస్టర్ భరత్, సంఘ పెద్దలు విల్సన్, మిలట్రీ ఏసోపు తదితరులు ఉన్నారు.

- ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధిని సన్మానిస్తున్న క్రైస్తవులు

సవాలు కాదు అవినీతి అక్రమాలపై చర్యలేవి

ప్రజాశక్తి-ఆదోని: ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి అవినీతి చిట్టాని విప్పుతానని ఎమ్మెల్యే పార్థసారథి విసిరిన ఛాలెంజ్‌ని స్వాగతిస్తున్నామని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ తెలిపారు. ఆదివారం వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యేగా గెలిచిన కొద్దిరోజుల పాటు సాయి ప్రసాద రెడ్డి పేరు కూడా ఎత్తని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి ఏకంగా ఆయన అవినీతి చిట్టా విప్పుతానని చాలెంజ్ చేయడం గొప్ప పరిణామమన్నారు. ఇంతటితో ఆగకుండా సాయి ప్రసాద్ రెడ్డి హయంలో జరిగిన అక్రమాలపై కేసు నమోదు చేయాలని మైనార్టీ హక్కుల పరిరక్షణ సంస్థ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. మరోపక్క మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అవినీతి చిట్టా తన చేతిలో ఉందని చెబుతూ ఆయనపై కేసు నమోదు చేయకపోగా ఆయన వస్తే ఆయన అవినీతి గురించి వివరిస్తానని చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఇది ఎలా ఉందంటే ఒక పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ ఒక దొంగ కనపడితే వాడిని పట్టుకుని లోపల వేయకుండా నువ్వు ఫలానా చోటుకు వస్తే నీ అవినీతి నీదొంగతనం గురించి చెప్తాను అన్నట్లుగా ఉందని పేర్కొన్నారు. పార్థసారథి గెలుపు కోసం ప్రాణాలు తెగించి పోరాడిన, పనిచేసిన టిడిపి కార్యకర్తల తరపున ఆదోని ఎమ్మెల్యే పార్థసారథికి ఒక ఛాలెంజ్ విసురుతున్నామన్నారు. ఆ ఛాలెంజ్ ఏమిటంటే ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాదరెడ్డిపై నిజాయితీగా పోరాడుతున్నానని అనుకుంటే మరో నెల రోజుల్లో సాయి ప్రసాద్ రెడ్డి హయాంలో జరిగిన అవినీతిపై కనీసం ఒక్క కేసైనా నమోదు చేయాలని ఛాలెంజ్ చేస్తున్నామన్నారు. మాటలు మనిషిఅని భావించవలసి వస్తుందన్నారు. ఆదోని ప్రజలు హిందువులు, ముస్లింలు, క్రైస్తవులను తేడా లేకుండా ప్రతి ఒక్కరు తమ మతం పట్ల ఎంతో నిబద్ధత విశ్వాసం కలిగి ఉంటారన్నారు. ఎమ్మెల్యే పార్థసారధి ఆదోని ప్రజలను నిజాయితీగా వ్యవహరించాలని, లేనియెడల తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. నాయకులు మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ , వసీమ్‌సాహెబ్ పాల్గొన్నారు.

వైభవంగా దసరా ఉత్సవం

- కన్నుల పండువగా రావణ కుంభకర్ణ సంహారం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలో దసరా పండుగ అత్యంత వైభవంగా కన్నుల పండుగగా జరిగింది. గత పది రోజులు పాటు జరిగిన దసరా మహోత్సవాలు ఆదివారం అమ్మవారి పల్లకి మహోత్సవంతో ముగిశాయి. ఆదివారం మున్సిపల్ మైదానంలోని జమ్మి చెట్టు వద్ద అమ్మవారి పల్లకి మహోత్సవం నిర్వహించారు. శనివారం రాత్రి మున్సిపల్ మైదానంలో రావణ కుంభకర్ణుల సంహారం ఎమ్మెల్యే పార్థసారథి, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంతాలు ప్రారంభించారు. అంతకుముందు శమీ పూజ, శ్రీ రామలీల వేడుకల్లో భాగంగా రావణ కుంభకర్ణ సంహార కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని అన్ని విధుల్లో పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారికి, జమ్మి చెట్టులకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి పట్టణంలో ఫారెస్ట్ లైన్ అంబ భవానిపేటలో వెలసిన శ్రీ అంభ భవాని దేవాలయంలో పూజలు నిర్వహించి రథోత్సవం, శ్రీరామ లీల కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దసరా ఉత్సవాల కమిటీ ఆధ్వరంలో జరిగిన సంస్కృతిక ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన వారికి ప్రత్యేకంగా ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు, విట్ట రమేష్, కునిగిరి నీలకంఠ, నాగరాజ్ గౌడ్, శ్రీనివాసరెడ్డి , ఎండి బసవరాజ్ స్వామి, గుడిసె కృష్ణమ్మ, శ్రీకాంత్ రెడ్డి ఉన్నారు.

ఆదోనిలో దసరా ఉత్సవాల్లో పాల్గొన్నప్రజలు

కొత్త సాంప్రదాయానికి నాంది పలికిన పీఠాధిపతులు

ప్రజాశక్తి-మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మికక్షేత్రమెన మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్ర తీర్థులు కొత్త సాంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా గ్రామ దేవత మంచాలమ్మను పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. శనివారం దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా గ్రామదేవత మంచాలమ్మను పల్లకిలో సింహ వాహనంపై అమ్మవారిని ఆశీనులు చేసి గ్రామ ప్రజలతో కలిసి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ రాఘవేంద్ర సర్కిల్ మీదుగా ఘనంగా ఊరేగించారు. ఏళ్ల చరిత్రలో అమ్మవారిని ఊరేగించిన దాఖలాలు లేవు. పీఠాధిపతుల చొరవతో గ్రామ సర్పంచి తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో అమ్మ వారి ఊరేగింపు కన్నుల పండుగగా సాగింది. కోలాటాలు వేస్తూ సాంప్రదాయ నృత్యాలతో మహిళలు ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి మాజీ ఉప సర్పంచి గోర్కల్ కృష్ణస్వామి పీఠాధిపతుల పూర్వాశ్రమ కుమారులు రాజా ఎస్.అప్రమేయచార్ శ్రీ మఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహ మూర్తి, వైసిపి నాయకులు జనార్ధన్ రెడ్డి, బిజెపి నాయకులు రాఘవేంద్ర టిడిపి నాయకులు కృష్ణ మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

దేవిశరన్నవరాత్రుల ఉత్సవాల్లో మంచాలమ్మ ఊరేగింపులో పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్ర తీర్థులు, తదితరులు

వైభవంగా దసరా వేడుకలు

మంత్రాలయం మండల పరిధిలోని గ్రామాల్లో దసరా వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. విజయ దశమి సందర్భంగా ముందుగా శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుబుధేంద్ర తీర్థులు శ్రీ లలితాదేవి అలంకరణలో ఉన్న గ్రామ దేవత శ్రీ మంచాలమ్మకు ప్రత్యేక పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. అనంతరం బన్నీ ఉత్సవాల్లో భాగంగా పీఠాధిపతులు రాత్రి శమీవృక్షానికి ప్రత్యేక పూజలు చేసి హారతులు ఇచ్చారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం అధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా స్థానిక వాసవి కళ్యాణ మండపంలో దుర్గా మాత అమ్మ వారికి తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు అందుకున్న నేపథ్యంలో విజయ దశమి రోజున శ్రీరాజరాజేశ్వరి అలంకరణలో దర్శనమిచ్చారు. గ్రామస్తులు, భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. శరన్నవరాత్రుల ముగింపు సందర్భంగా రాత్రి ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌లో దుర్గా మాత అమ్మ వారిని కొలువుంచి పూజలు చేసి యువతీ యువకులు, మహిళలు, పురుషులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాల మధ్య తుంగభద్ర నది వరకు ఉరేగింపు నిర్వహించారు. అనంతరం తుంగభద్ర నది తీరం లో దుర్గా మాత అమ్మ వారికి చివరి పూజలు చేసి తుంగభద్ర నది లో నిమజ్జనం చేశారు.

శమీ వృక్షానికి పూజలు చేసిన ఎమ్మెల్యే వై.బాలనాగి రెడ్డి

విజయ దశమి పండుగను పురస్కరించుకుని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి , కాచాపురం సర్పంచి ఎమ్మెల్యే సతీమణి జయమ్మలు శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ముగిసిన దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి - దేవనకొండ

మండల కేంద్రమైన దేవనకొండ, తెర్నేకల్లు, కరివేమల, గుండ్లకొండ, కోటకొండ తదితర గ్రామాల్లో దసరా పండుగ ఉత్సవాలు ఆయా గ్రామాల ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. దేవనకొండ లోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం, సుంకుల పరమేశ్వరి ఆలయాల్లో దేవతా విగ్రహాలకు 10 రోజులపాటు ప్రత్యేక అలంకరణాలు చేసి పూజలు నిర్వహించారు. కరివేముల గ్రామంలో దుర్గామాత దేవత విగ్రహాన్ని కూర్చోబెట్టి ప్రత్యేక పూజలు చేసి చెరువులో నిమజ్జనం చేశారు. విజయదశమి వేడుకలు ఆదివారంతో ముగిశాయి.

నేడు పల్లె పండుగకు జిల్లా కలెక్టర్ రాక

ప్రజాశక్తి- దేవనకొండ

మండల కేంద్రమైన దేవన కొండలో సోమవారం నిర్వ హిస్తున్న కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా హాజరవుతున్నట్లు ఎంపిడిఒ గౌరీ దేవి ఆదివారం విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే విరుపాక్షి, ఆలూరు టిడిపి ఇన్చార్జి వీరభద్ర గౌడ్ హాజరవుతున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా దేవనకొండతో పాటు పొట్లపాడు, కుంకనూర్ గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాలు జరగనున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు రానున్నరన్నారు.

సాయిబాబా మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

మానవహక్కుల నేత, ప్రముఖ రచయిత, ఢిల్లీయూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జి.ఎన్ సాయిబాబా శనివారం హైదరాబాదులో కిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందడం జరిగిందని, ఆయన మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పట్టణ కార్యదర్శి జి.రంగన్న ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ సాయిబాబాకు మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయనే నెపంతో 90శాతం అంగవైకల్యం ఉన్న ప్రొఫెసర్ సాయిబాబాను 10 ఏళ్ల పాటు జైలు అండా సెల్ లో ఉంచి తన ఆరోగ్య సమస్యలను పట్టించుకోకుండా ఎన్నో చిత్రహింసలకు గురిచేసి, మానసికంగా వేధించారన్నారు. కనీసం తన తల్లి చనిపోతే కడచూపు చూడనివ్వలేదని అన్నారు. ఈ దేశంలో పీడిత ప్రజల గొంతై మాట్లాడిన మేధావులను చిత్రహింసలకు గురి చేయడం పరిపాటిగా మారిందని అన్నారు. గతంలో ఆదివాసి హక్కులనేత పాస్టర్‌స్టాన్‌స్వామికి కూడా జైలులో బెయిల్ ఇవ్వకుండా, సరైన వైద్యం అందించకుండా నిర్లక్ష్యం చేయడం వలన చనిపోయాడని గుర్తు చేశారు. ప్రొఫెసర్ సాయిబాబా పీడిత ప్రజల విముక్తి కోసం తన కళాన్ని, గలాన్ని వినియోగించి చనిపోయేంత వరకు పోరాడరన్నారు. ఖైదీల హక్కుల కోసం పోరాటం మొదలుకొని గ్రీన్ హంట్‌కు వ్యతిరేకంగా, దళిత, ఆదివాసి హక్కుల కోసం పోరాడిన మహనీయుడని కొనియాడారు. ప్రొఫెసర్ సాయిబాబా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలో ఒక రైతు కుటుంబంలో జన్మించి ఢిల్లీ ప్రొఫెసర్ స్థాయికి ఎదిగి, ప్రజల కోసం తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకి తీరని లోటని అన్నారు. ప్రొఫెసర్ సాయిబాబా మతి పట్ల సిపిఐ తరపున ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించి, వారి కుటుంబానికి ప్రగాడ సానుభూతి వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ సాయిబాబా ఆశయా సాధనకు కృషి చేయడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్: ఎమ్మెల్యే బివి

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ బివి. జయనాగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక కుర్నీ కళ్యాణ మండపంలో ప్రజా దర్బార్‌లో వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుండి వ్యక్తిగత, రోడ్లు డ్రైనేజీ మురుగు కాలువ, తాగునీటి సమస్యలు తదితర అంశాలపై 430 వినతులు వచ్చాయన్నారు. వాటిని వివిధ శాఖ అధికారులతో చర్చించి పరిష్కారం చేస్తామని, భవిష్యత్తులో కూడా మరిన్ని సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ నిర్వహిస్తామన్నారు. అధికారులు, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

చెన్నకేశవ స్వామి రథోత్సవంలో అపశృతి

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు రూరల్

ఎమ్మిగనూరు మండలం కందనాతి గ్రామంలో దసరా పండుగ సందర్భంగా ఘనంగా నిర్వహిస్తున్న చెన్నకేశవ స్వామి రథోత్సవంలో కొండ పైన ఉన్న చెన్నకేశవ స్వామి దగ్గరికి ఉత్సవ రథాన్ని తీసుకెళ్లే సమయంలో ఒరిగి పడటంతో మల్లికార్జున, హరికృష్ణ, వినోద్, భీమేష్, శంకర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి.

రూ 2 కోట్ల పనులకు నేడు భూమి పూజ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా ఉపాధి హామీ పథకం నిధుల కింద ఓర్వకల్ లోని రెండు కోట్ల పనులకు ఎమ్మెల్యే గౌరీ చరిత రెడ్డి సోమవారం భూమి పూజ చేయనున్నారని టిడిపి మండల కన్వీనర్ గోవింద్ రెడ్డి ఆదివారం పేర్కొన్నారు. అనంతరం ఎంపిడిఒ, సాంప్రదాయ ప్రజా సమస్యలు పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి అర్జీలను కూడా స్వీకరిస్తారని పేర్కొన్నారు. కూటమి పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని పేర్కొన్నార

నేటి నుంచి పల్లె పండుగ వారోత్సవాలు

ప్రజాశక్తి - ఆస్పరి



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పల్లె పండుగ వారోత్సవాలు కార్యక్రమం సోమవారం నుంచి ఈ నెల 20 వరకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గీత వాణి విలేకర్లకు ఆదివారం తెలిపారు. మండలంలోని ఆయా సచివాలయంలో నిర్వహించే పల్లె పండుగ కార్యక్రమం ద్వానా గ్రామాలలో నెలకొన్న డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్లు,గోకులం షెడ్లు సంబంధించి పనులు ప్రారంభోత్సవానికి శంకుస్థాపన చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి మండల అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధు లు, ఉపాధి సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా దసరా వేడుకలు

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

ఓర్వకల్ మండలంలోని అనేక గ్రామాల్లో దసరా వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని దేవాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. హుసేనాపురం గ్రామంలో నిర్వహించిన విజయదశమి వేడుకల్లో భాగంగా టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ , వాటర్ షెడ్ కమిటీ చైర్మన్ పెద్దస్వామి పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాల ఊరేగింపు కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా మరణానికి ప్రభుత్వ విధానాలే కారణం

ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ వేదిక

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రొఫెసర్ సాయిబాబా అకాల మరణానికి ప్రభుత్వ విధానాలే కారణమని, ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని (ఒపిడిఆర్) ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.కరుణాకర్ రావు, ఆర్.నరసింహులు అన్నారు. వారు మాట్లాడుతూ ప్రొఫెసర్ జిఎన్ సాయిబాబా మరణం వలన ఏర్పడిన లోటు ఎవరు పూడ్చలేనిది అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అనకాపల్లిలో జన్మించిన జిఎన్ సాయిబాబా యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ లో విద్యాభ్యాసం ముగించుకున్న తర్వాత ఢిల్లీ యూనివర్సిటీలో ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా జాయిన్ అయ్యారు. ఆయన ఢిల్లీ యూనివర్సిటీలో ఉండగా ఒక వ్యక్తి ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా సాయిబాబాకు అబూజ్‌మడ్‌లోని మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయనే పేరుతో 2014 మే 9న గడ్చిరోలి పోలీసులు సాయిబాబాను అరెస్టు చేసి నాగపూర్ జైల్లో ఉంచారని తెలిపారు. వికలాంగుడైనప్పటికీ ఒంటరి జీవితాన్ని గడిపాడని అన్నారు. ఆయనకు నాగపూర్ సెంట్రల్ జైల్లో సరియైన వైద్యంకల్పించక పోవడం వల్ల ఆయన ఆరోగ్యం దెబ్బతిని కోలుకోలేని స్థితికి వెళ్లి 57 సంవత్సరాల వయసులోనే మరణించడానికి ప్రభుత్వ నిర్బంధ విధానాలే కారణమని అన్నారు.

డి.రామాంజనేయులుకు ఆత్మీయ సన్మానం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఎపి అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ గా టిడిపి మండల అధ్యక్షులు డి రామాంజనేయులు నామినేటెడ్ పదవి వచ్చినందుకు 1995-97 ఇంటర్ బ్యాచ్ స్నేహితులు కలసి కర్నూలులో శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు అడ్వకేట్ లక్ష్మన్న, అర్జున్, మద్దయ్య, కృష్ణ, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్రి పండుగకు డబ్బులు ఇవ్వలేదని...

భార్యను చంపిన భర్త

ప్రజాశక్తి - గోనెగండ్ల : కర్రి పండుగ చేసుకోవడానికి డబ్బులు ఇవ్వలేదని భార్యపై భర్త దాడి చేయడంతో భార్య మృతి చెందిన సంఘటన గోనెగండ్ల మండలం కులుమాలలో చోటుచేసుకుంది. గోనెగండ్ల సిఐ గంగాధర్ వివరాల ప్రకారం. కురువ క్రిష్ణవేణికి చెందిన కురువ చిన్న పక్కీరప్పతో ఏడేళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు. ఆదివారం భార్యాభర్తలు ఇద్దరూ పొలానికి వెళ్లారు. పనులు ముగించుకుని వస్తున్న సందర్భంగా కర్రిపండగ చేసుకోవడానికి డబ్బులు ఇవ్వాలని భార్యకృష్ణవేణిని భర్త చిన్నపకిరప్ప అడిగాడు. ఆమె నిరాకరించింది. ఇదే విషయంపై ఇంటికి వచ్చిన తర్వాత ఇంటిదగ్గర జరిగిన గొడవలో భార్య తలపై భర్త రాయితో కొట్టడం, బలంగా తోయడం వలన ఆప స్మారక స్థితిలోకి వెళ్లింది. గ్రామస్తులు 108 అంబు లెన్స్‌కు ఫోన్ చేశారు. అంబులెన్స్ రావడం ఆలస్యమైందని పక్కీరప్ప తమ్ముడు రామలింగం గ్రామస్తులతో కలిసి మోటార్ సైకిల్‌పై ఆమెను తీసుకొని అంబులెన్స్‌కు ఎదురు వెళ్ళగా పుట్టపాశం గ్రామ సమీపంలో అంబులెన్సు సిబ్బంది పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిపారు.

జ్వరంతో ఒకరు మృతి

ప్రజాశక్తి-ఆస్పరి

జ్వరం బారిన పడి యువకుడు మృతి చెంది కన్నతల్లికి కంటి శోకం మిగిల్చిన సంఘటన ఆదివారం ఆస్పరిలో చోటు చేసుకుంది. మండల కేంద్రమైన ఆస్పరికి చెందిన శివ (16) మృతి చెందాడు. భీమేష్, మహేశ్వరి దంపతులకు కుమారుడు శివ, కుమార్తె వర్షిత ఉన్నారు. హోటల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శివకు జ్వరం రావడంతో శనివారం ఉదయం ఆదోనిలోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. పరిస్థితి విషమించడంతో కర్నూలు ప్రవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. చేతికి వచ్చిన కొడుకు మృతి చెందడంతో ఆ కుటుంబానికి తీరని శోకం మిగిలింది. తండ్రి భీమేష్ కూడా 2018లో అనారోగ్యంతో మృతి చెందాడు. భర్త, కొడుకు మృతి చెందడం ఆ కుటుంబానికి తీరని లోటు అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. యువకుడి మృతి పట్ల ఆస్పరి సర్పంచి మూలింటి రాధమ్మ, కెడిసిసి జిల్లా బ్యాంక్ మాజీ డైరెక్టర్ రాఘవేంద్ర ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

IN THE COURT OF THE VII th ADDL DIST JUDGE : KURNOOL
MVOP NO.85 OF 2024

U.JASHWANTH (Minor)
by Guardian U.Ramudu. ...Petitoner
Vs
M.Nadipi Rangaswamy. ...Respondents
& others

(Notice to R1)
Mala Nadipi Rangaswamy
S/o Chinna Singarapan
Auto owner AP 21 TE 2124
R/o H.No.8/88, Chennamapalli (V),
Tuggali (M), Kurnool (Dist),
Cell : 9100593396

(Notice to R3)
Mala Ramesh S/o Chinna Rangaswamy
Auto Driver, H.No.8/88,
Diguva Chintalakonda (V),
Tuggali (M), Kurnool (Dist),

(Notice to R1 and R3)

పైన కనపరచిన పిటీషనర్ యు.జశ్వంత్ తనకు ప్రమాదంలో తగిలిన గాయాలకు నష్టపరిహారం కొరకు పై కోర్టు నందు పిటీషన్ వేసినారు. సదరు పిటీషన్‌లో మీ హాజరుకొరకు 18-11-2024న వాయిదా ఉన్నది. కావున మీరు స్వయంగా లేదా వకీలు ద్వారా 18-11-2024న ఉదయం 10.30 గంటలకు పై కోర్టునందు హాజరయి. మీ ఆక్షేపణలున్న యెడల తెలియజేసుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(By Court Order)

Y.Sreenivasulu,
Smt S.V.Lakshmi,
A.Sekhar ,
Advocates, Kurnol.
Cell : 9440768473